
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0 | కనిష్ఠం : 20.0

ANDHRAJYOTHY



మంగళవారం 24 డిసెంబరు 2024



పాలమూరు అయోధ్యనగర్ కాలనీలో విద్యుద్దీపాలతో ఫాతీమా చర్చి

చర్చీల ముస్తాబు

పాలమూరులో క్రిస్మస్ శోభ నెలకొంది. పండుగ సందర్భంగా పట్టణంలోని చర్చీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అక్కడ ఏర్పాటు చేసిన క్రీస్తు పుట్టిన పశువుల పాక, క్రిస్మస్ ట్రీ, నక్షత్రాలు ఆకట్టుకుంటున్నాయి.


6


జమిలికి జై..


ఒకేసారి లోక్‌సభ, శాసన సభలకు ఎన్నికలు జరిగితే మేలనే భావన



















- ప్రాంతీయతకు కూడా ప్రాధాన్యం ఉంటుందంటున్న వివిధ వర్గాలు
- వన్ నేషన్, వన్ ఎలెక్షన్‌తో అధ్యక్ష తరహా పాలన వస్తుందని భయాందోళన
- పాలనా సౌలభ్యం కోసం జమిలి ఎన్నికలు కావాలంటున్న పరిస్థితి
- రాష్ట్రంలో ప్రతీ సంవత్సరం ఏదో ఒక ఎన్నికపై తీవ్రంగా వ్యతిరేకత

"బీజేపీ గత రెండు లోక్‌సభ ఎన్నికల సందర్భంగా లేవనెత్తిన వన్ నేషన్, వన్ ఎలెక్షన్ విధానాన్ని అమలు చేసేందుకు పూనుకున్నది. ఈ మేరకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఈ విధానంపై అధ్యయనం చేసిన తర్వాత పార్లమెంట్ ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి నివేదించింది. ఇది చట్టంగా మారితే భారత దేశ పరిస్థితులకు అనుకూలమా, లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈ జమిలి ఎన్నికల విధానాన్ని తీసుకొస్తుండగా ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీలు మాత్రం దేశంలోని సమాఖ్య పాలన కాస్త అధ్యక్ష తరహా వైపు పయనిస్తుందని, ప్రాంతీయ పార్టీలకు ప్రాధాన్యం ఉండదని, ప్రాంతీయ సమస్యలు చర్చకు రాకుండా పోతాయనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికలపై ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించగా ఈ బిల్లుపై కొందరు భయాందోళనలు వ్యక్తం చేస్తుండగా అత్యధిక మంది మద్దతు పలికారు."

మహబూబ్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్, వన్ ఎలెక్షన్ నినాదంలో భాగంగా ఇటీవల లోక్‌సభకు, రాష్ట్రాల శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ బిల్లు జేపీసీ (జాయింట్ పార్లమెంటరీ కమిటీ)కి వెళ్లింది. అంతకుముందే మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఈ ఎన్నికల విధానాన్ని తీసుకురావడంపై సుదీర్ఘమైన విశ్లేషణ, న్యాయ సమీక్షలు జరిగాయి. ఎట్టకేలకు సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా జేపీసీ కి నివేదించారు. ఇది చట్టంగా మారడానికి వచ్చే లోక్‌సభ సమావేశాల వరకు ఆగాల్సి ఉంది. ఈ క్రమంలో జమిలి ఎన్నికల విధానం చారిత్రాత్మక నిర్ణయమని అధికార బీజేపీ ప్రకటనలు చేస్తుండగా, విపక్షాలు మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు ఈ బిల్లుపై నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ, శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతుండగా చాలా రాష్ట్రాల్లో మాత్రం వివిధ సంవత్సరాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రతీఏటా ఏదో ఒకచోట ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రజాధనం వృథా కావడంతో పాటు ఎన్నికల కోడ్ తదితర చర్యలతో ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఉన్నాయి. అయితే ఈ బిల్లు ప్రకారం ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా కూలిపోయినా, లేక శాసనసభను రద్దు చేసినా, దేశం మొత్తంగా ఎన్నికల సమయం వచ్చే వరకు ఆ మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఇది కూడా చాలా ఇబ్బందిగానే మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజలు తక్కువ కాలం ఉంటే రెండు సార్లు ఎన్నికలను ఎదుర్కోవడం, లేదా ఒక టర్మ్‌లో రెండు సార్లు ప్రభుత్వాలు

(మిగతా 6లో..)

ప్రజావాణికి 45 ఫిర్యాదులు

- గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 45 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మానికి అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందినట్లు కార్యాలయ అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసమర్థ పాలన నడుస్తోందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందని, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాది అయినా పది శాతం పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. యాసంగికి సాగునీళ్లు లేవని చెప్పడం ఈ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల అవివేకమన్నారు. ఈ ఏడాది 35 రోజులు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయని, దాదాపు 25 నుంచి 30 టీఎంసీల నీరు సముద్రం పాలైందని తెలిపారు. నీటిని ఎలా ఒడిసి పట్టాలో తెలియక, యాసంగి సీజన్‌కు నీళ్లు లేవని ఇరిగేషన్ సమావేశం పెట్టకుండా ఒక డిప్యూటీ ఇంజనీరుతో ప్రకటన చేయించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు లక్ష్మయ్య వాకిటి శ్రీధర్, కురుమూర్తి, మాణిక్యం పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలే ముఖ్యం

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి
- జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా సాగునీటి విడుదల



జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీకి రైతు ప్రయోజనాలే ముఖ్యమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ హైదర్ రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో పేదవాళ్లకు ఇబ్బంది కలగదని అన్నారు. ఈ రోజు అంతర్జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సాగునీటిని విడుదల చేయడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశారని తెలిపారు. సంక్రాంతి తరువాత రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాలలో జమచేస్తామని అన్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో జూరాల ప్రాజెక్టు అధికారులు, కాంగ్రెస్ రాష్ట్ర కల్లు విభాగం చైర్మన్ కేశం నాగ రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అయుబ్‌ఖాన్, మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు సమాన ఆదరణ

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



పాస్టర్‌కు కేక్ తినిపిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల ప్రజలను, వారి విశ్వాసాలను సమానంగా ఆదరిస్తుందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. డిసెంబరు 25న క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని సోమవారం వనపర్తి పట్టణంలోని ఆలివ్ మెన్నోనైట్ బ్రెత్రెన్ చర్చిలో క్రైస్తవులకు ఏర్పాటు చేసిన ప్రేమవిందు కార్యక్రమానికి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి చిన్నారెడ్డి హాజరై మాట్లాడారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని క్రైస్తవులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలో ప్రేమవిందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. యేసు ప్రభు దైవదూత అని రోగులను, పాపులను తన ప్రేమతో నయం చేస్తారని చెప్పారు. క్రైస్తవులకు క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పాస్టర్లకు పంచారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మునిసిపల్ చైర్మన్ మహేష్, జడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ డిమాండ్
- నేడు గద్వాల పట్టణంలో భారీ ర్యాలీ

7

అంబేడ్కర్‌ను అవమానించడమంటే రాజ్యాంగాన్ని అవమానించినట్టే

-నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి



అచ్చంపేటలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లురవి

అచ్చంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ను అవమానించడమంటే భారత రాజ్యాంగాన్ని అవమానించినట్టేనని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలతో అంబేడ్కర్‌పై బీజేపీ వైఖరి ఏమిటో మరోసారి బహిర్గతమైందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటు అత్యున్నత వ్యవస్థ అన్నారు. మనసు నిండా మనువాదాన్ని నింపుకొని అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించే బీజేపీ నేతలకు రాజ్యాంగబద్ధ పదువుల్లో కొనసాగే నైతిక హక్కు లేదన్నారు. తక్షణమే దేశ ప్రజలకు క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామనాథం, కుంద మల్లికార్జున్, మల్లేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మా ఊరు - మా పాలన

కావాలంటున్న అడవి బిడ్డలు

- నేడు పీసా దినోత్సవం, మన్ననూర్ గిరిజన భవనంలో సభ
- గిరిజనులలో పీసా, ఏజెన్సీ చట్టాలపై పెరిగిన అవగాహన
- నల్లమలలోని ప్రతీ చెంచు పెంట, గూడెంలో పీసా కమిటీలు, తీర్మానాలు

6



పదర : పెట్రాల్‌చేను చెంచు పెంటలో పీసా తీర్మాన గ్రామసభ

డబ్బులెవరికీ ఊరికే రావు..

నాణ్యమైన వస్తు, సేవలను పొందడం మన హక్కు

- సరైన అవగాహన లేక నష్టపోతున్న ప్రజలు
- మోసపోతే ఫోరంను ఆశ్రయించాలి
- నేడు జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

7

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల్లో సభ్యులుగా లేని మహిళలకు సభ్యత్వం చేయించాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ గ్రామీణాభివృద్ధి సంస్థ మహిళా సాధికారత దిశగా చేపడుతున్న వివిధ రకాల ప్రభుత్వ పథకాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అండగా ఉంటుందని, వారి కోసం రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఒక ఇంట్లో ఒక మహిళ ఆర్థి కంగా అభివృద్ధి చెందితే ఆ కుటుంబం ఎంతో ఆనందంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ఈ ఆర్థిక సంవ త్సరం 2024-25 లక్ష్యాలను వంద శాతం సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తప్పులు లేకుండా, త్వరితగతిన పూర్తి చే యాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి చిన్న ఓబులేష్, అదనపు పీడీ రాజేశ్వరి, డిప్యూటీ సీఈవో పాల్గొన్నారు.

గుంతమగ్గంతో అవస్థలు

- ఫ్రేమ్ మగ్గాల కోసం దరఖాస్తులు
- 90 శాతం సబ్సిడీపై అందించాలంటున్న నేతన్నలు

రాజోలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టు చీరలు తయారు చేసేందుకు చేనేత కార్మికులు గుంతమగ్గంతో ఒకరోజు శ్రమిస్తే కూడా కూలీ గిట్టుబాటు కావడం లేదు. రోజుకు 10 గంటల పాటు నేస్తుండటంతో కీళ్ల నొప్పులు వస్తున్నాయి. వర్షాకాలంలో మగ్గం తడిచిపోవడం, మగ్గం గుంతల్లో నీరు నిండటంతో రోజులు తరబడి పనులు నిలిచిపోతున్నాయి. సులువుగా నేసేందుకు వచ్చిన ఫ్రేమ్ మగ్గాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించాలని నేత కార్మికులు కోరుతున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 6,948 మంది చేనేత కార్మికులు ఉన్నారు. వారిలో 2,695 మంది జియోట్యాగ్ కలిగిన కార్మికులు ఉన్నారు. ఇందులో దాదాపుగా 90 శాతం మందికి గుంత మగ్గాలే ఉన్నాయి. గతంలో బీఆర్ఎస్ హయాంలో కార్మికులకు ఫ్రేమ్ మగ్గాలను అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీని కోసం కార్మికుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం రెండు వేల మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మగ్గాలు ఇంట్లోనే కూర్చుని నేసుకునేందుకు వీలుంటుంది. పని కూడా త్వరగా పూర్తి చేసుకోవడంతో పాటు, అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం ఫ్రేమ్ మగ్గాలను 90 శాతం సబ్సిడీతో అందించాలని కార్మికులు కోరుతున్నారు.



గుంత మగ్గంతో పట్టు చీరలు నేస్తున్న కార్మికుడు

ఫ్రేమ్ మగ్గాలు అందించాలి



రాజోలి గ్రామంలో చాలా కుటుంబాలు చేనేత వృత్తిపై ఆధారపడి ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఫ్రేమ్ మగ్గాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. కానీ ఇంత వరకు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ఫ్రేమ్ మగ్గాలను అందించాలని కోరుతున్నాం.

- సర్ల రాజు, రాజోలి చేనేత కార్మికుడు

దరఖాస్తులు తీసుకున్నాం



బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నతాధికారుల అదేశాల మేరకు ఫ్రేమ్ మగ్గాలకు దరఖాస్తులు తీసుకున్నాం. జిల్లాలో మొత్తం రెండు వేల మందికి పైగా చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు.

- గోవిందయ్య, చేనేత, జౌళీశాఖ ఏడీ

జమిలికి జై..

(మొదటి పేజీ తరువాయి)

కూలిపోతే ఏంటి అనే ప్రశ్నలు ప్రజా బాహుళ్యంలో ఉన్నాయి. అయినప్పటికీ మెజారిటీ ప్రజలు జమిలి ఎన్నికలకే జై కొడుతున్నారు. జమిలి ఎన్నికలపై ఆంధ్రజ్యోతి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో 2650 మంది విద్యావంతులు, ఉద్యోగులు, విద్యార్థులతో సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో జమిలిపై మెజారిటీ ప్రజలు ఒకే చెబుతుండగా, జమిలి ద్వారా ఇబ్బందులవుతాయని చెబుతున్నవారు కూడా ఎక్కువే ఉన్నారు.

వన్ నేషన్, వన్ ఎలెక్షన్..

భారతదేశం రాష్ట్రాల కలయిక. దాని ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి. జమిలి ఎన్నికలతో రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆయా ప్రాంతీయ పార్టీలు బావిస్తున్నాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు కూడా శాసన సభలకు, లోక్ సభకు ఒకేసారి ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తున్నారు. అలా జరిగితే ఒక్కో ఎన్నికలో ఒక్కో తరహా హామీలు ఇవ్వడం, మళ్లీ ఎన్నిక వస్తే పాత హామీలను మరిచిపోయి కొత్త హామీలు ఇవ్వడం తగ్గుతుందని, ప్రభుత్వానికి ఆ ఐదేళ్ల హామీలను అమలు చేయడానికి వీలుపడుతుందని అభిప్రాయపడుతున్నారు. ఉచిత పథకాలు ఇవ్వడం కూడా కొంత మేర నియంత్రివచ్చని, కావాల్సిన పనులను హక్కుగా పొందవచ్చని అంటున్నారు.

అధ్యక్ష పాలనకు దారితీసే అవకాశం..

ఆంధ్రజ్యోతి సర్వేలో వన్ నేషన్, వన్ ఎలెక్షన్ అధ్యక్ష పాలనకు దారితీస్తుందా? అని ప్రశ్నించగా మెజారిటీ ప్రజలు అవుననే సమాధానమివ్వడం గమనార్హం. ప్రస్తుతం దేశంలో వివిధ రాష్ట్రాల ప్రాంతీయ పార్టీల మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడుతుంది. కానీ, దేశం మొత్తం ఒకే సారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రాంతీయ నినాదం పనిచేయక, జాతీయ పార్టీలే గెలిచే పరిస్థితి ఉంటుంది. దీంతో ఏక కేంద్ర పాలనకు దారితీసే పరిస్థితి ఉందని వేధావులు హెచ్చరిస్తున్నారు.

జమిలీ ఎన్నికలు భారతదేశంలో కష్టం

భారతదేశం విభిన్న బాషలు, సంస్కృతి కలిగి రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగం ద్వారా చాలా అంశాలు స్వయం ప్రతిపత్తి కలిగి ఉన్నాయి. ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ల ఎజెండా వేరువేరుగా ఉంటుంది కాబట్టి జమిలీ ఎన్నికలు ఒప్పుకోరు. జమిలీ ఎన్నికల్లో ప్రాంతీయతకు కొంచెం నష్టం జరుగుతుంది. ప్రజాస్వామ్యం నుంచి అధ్యక్ష తరహా పాలనకు దారి తీస్తుంది. కానీ ఎన్నికలు ఒకేసారి జరిగితే ప్రజా ఆకర్షణ పథకాలు తగ్గి ఆర్థిక వ్యవస్థ కొంచెం బాగుపడే అవకాశం ఉంది.

– పి.జనార్ధన్‌రెడ్డి, విద్యావేత్త, నారాయణపేట



క్రీడల్లో పతకాలు సాధించిన మైనారిటీ గురుకుల విద్యార్థులు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

రీజినల్ లెవల్ కో-ఆర్డినేటర్ ఖాజాబహొద్దీన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా రీజినల్ లెవల్ కో-ఆర్డినేటర్ (ఆర్ఎల్‌సీ) ఖాజాబహొద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల - 1, 2, 3 గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవలే జరిగిన సీఎం కప్ జిల్లా స్థాయి వివిధ క్రీడా అంశాల్లో పతకాలు సాధించగా, సోమవారం భగీరథ కాలనీ గురుకుల పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు అన్ని అంశాల్లో రాణిస్తున్నారని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎదగాలని ఆకాక్షించారు. ప్రతిభ గల క్రీడాకారులకు సొసైటీ అండగా ఉంటుందన్నారు. అకాడమిక్ కో-ఆర్డినేటర్ జహీర్, ప్రిన్సిపాల్స్ లక్ష్మి, శ్రీదేవి, రేఖ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి: సీఐటీయూ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు కనీసం వేతనం ఇవ్వాలని ఈనెల 27, 28 తేదీల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మె నోటీస్‌ను సోమవారం కలెక్టరెట్ ప్రజావాణి కార్యక్రమంలో డీపీవో పార్థసారథికి అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కార్మికుల రూ.18 వేల వేతనాన్ని అమలు చేయాలన్నారు. గుర్తింపు కార్డు, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాటివిటీ, పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. 27వ రోజు కార్మికులంతా జిల్లా కేంద్రంలోని మునిసిపల్ టౌన్‌హాల్‌కు చేరుకోవలన్నారు. 28వ తేధి నాడు సాముహికంగా కలెక్టరెట్ ముందు నిర్వహించే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యకు జీడీపీలో ఆరు శాతం కేటాయించాలి

విద్యా సదస్సులో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

వనపర్తి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యకు జీడీపీలో ఆరు శాతం బడ్జెట్ కేటాయించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులో ఉన్నప్పుడే దేశం బాగుపడుతుందని అన్నారు. టీఎస్ యూటీఎఫ్ వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి పట్టణంలో ఎంవైఎస్ ఫంక్షన్ హాల్‌లో విద్యా సదస్సు నిర్వహించారు. సదస్సుకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి ప్రసాద్ గౌడ్ అధ్యక్షత వహించారు. భారీగా హాజరైన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. విద్యా ఆరోగ్యం ప్రజలకు ఉచితంగా అందుబాటులో అందించాల్సిన ఆవశ్యకత ప్రభుత్వాలపై ఉందన్నారు. విద్య పేద ప్రజలకు అందని ద్రాక్షగా ఉందని, కార్పొరేటీకరణ పెరిగిపోవడంతో ఈ విద్య పేద ప్రజలకు అందకుండా పోతుందని వారు ఆరోపించారు. జాతీయ విద్యా విధానం పేరుతో ప్రాథమిక, ఉన్నత విద్యా రంగాన్ని ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తుందని ఆరోపించారు. విద్యకు అధిక నిధులు కేటాయించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, ఆయా పాఠశాలల్లో మౌలిక కల్పనకు రూపకల్పన చేయాలని అన్నారు. విద్య కాషాయీకరణ పెరిగిపోవడం వలన అంతరాలు పెరిగిపోతున్నాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి అమిద్, కె.జ్యోతి, జిల్లా కోశాధికారి వెంకటేష్, ఎంఈవోలు, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాసులు, డీఎస్‌వో శ్రీనివాసులు, ప్రముఖ కవి జనజ్వాల, రాజారాం ప్రకాష్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాగరాజు , శ్రీనివాస్ గౌడ్, తిమ్మప్ప, వెంకటేష్, అరుణ ,అనసూయ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదల అరికట్టాలి

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకుల ధరలను అరికట్టాలని కన్స్యూమర్స్ అవేర్‌నెస్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఆడమ్స్ తెలిపారు. నిత్యావసర సరుకుల విషయంలోనైనా ప్రత్యేక అజమాయిషి ప్రభుత్వాలకు లేకపోవడం వల్ల సంపాదించిందంతా ప్రజలు వాటికే ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సంపాదన పెరిగిందని ఆనందిస్తున్నారు. కానీ మార్కెట్‌లో ధరలు ముందు ఓడిపోక తప్పడం లేదన్నారు. వైద్య, విద్యా సంస్థల సేవల విషయంలో ధరల నియంత్రణ ఊసేలేదన్నారు. వినియోగదారుని దగ్గర పన్నులు వసూలు చేస్తున్నా కొన్న వస్తువులకు రసీదు ఇవ్వకపోవడంతో అకౌంటబిలిటి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి శేరి వెంకటొరెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ భార్య ఆత్మహత్యాయత్నం

మహబూబ్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): చేయని తప్పునకు తన భర్త సస్పెండ్‌కు గురయ్యారని మనస్థాపానికి గురైన ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ భార్య ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. జనరల్ ఆస్పత్రిలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో పని చేస్తున్న ఓ హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్‌ఐల మధ్య గొడవ జరుగుతోంది. కొద్ది రోజుల క్రితం హెడ్ కానిస్టేబుల్‌కు పైఅధికారులు చార్జి మెమో ఇచ్చారు. మెమో తీసుకోవడానికి నిరాకరించడంతో ఏకంగా సస్పెండ్ ఉత్తర్వులు వచ్చాయి. ఏఎస్‌ఐతో ఉన్న విభేదాల కారణంగా ఆయనే ఉన్నతాధికారులతో తనను సస్పెండ్ చేయించాడని హెడ్ కానిస్టేబుల్ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. డ్యూటీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉండటంతో ఆరా తీసిన భార్యకు సస్పెండ్ అయినట్లు చెప్పాడు. మనస్థాపంతో ఆమె ఇంట్లో ఉన్న శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు జనరల్ ఆస్పతికి తరలించారు. చికిత్స అందించడంతో ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్ల మధ్య వివాదం రచ్చకెక్కడంతో ఆస్పత్రి అధికారులు, పోలీసులు ఇరువురికి నచ్చజెప్పారు. పోలీస్ ఉన్నతాధికారులు కూడా జోక్యం చేసుకుని వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

‘ఎలివేటెడ్ కారిడార్‌ను మన్ననూరు నుంచే ఏర్పాటు చేయాలి’

మన్ననూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అతిపెద్దదైన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని నల్లమల అభయారణ్యంపై నుంచి నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని, దీని నిర్మాణాన్ని మన్ననూరు దుర్వాసుల చెరువు నుంచి నిర్మించాలని అమ్రాబాద్ మండలం మన్ననూరు చెందిన కాంగ్రెస్ నాయకులు అచ్చంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగర్‌కర్నూలు ఎంపీ మల్లురవి, వన్యప్రాణి సంరక్షణ బోర్డు సభ్యుడు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలను సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యేలు రాబోయే రోజుల్లో మన్ననూరును పర్యటక హబ్‌గా ఏర్పాటు చేస్తానని, గ్రామంలోని చెక్‌పోస్టు నుంచి దుర్వాసుల చెరువు చెక్‌పోస్టు వరకు ఐదు కిలో మీటర్ల నాలుగు లైన్ల రహదారిని ఏర్పాటు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు పనులు చేపట్టాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

చిన్నచింతకుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నచింతకుంట నుంచి ఉంద్యాల గ్రామానికి వెళ్లే పీఆర్ రోడ్డు పనుల జాప్యానికి నిరసనగా సోమవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నంబిరాజు, అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్, మండల అధ్యక్షుడు దశరథ్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.3.50 కోట్లతో 2021లో పనులు చేపట్టగా, 2023లో పనులు పూర్తిచేయాలని అగ్రిమెంట్‌లో ఉన్నా సంబంధిత కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ పూర్తి కాలేదన్నారు. దీంతో రెండు గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఎల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీరాజ్ ఏఈ సత్యకృష్ణతో మాట్లాడి జనవరిలో జనులు ప్రారంభించేందకు చర్యలు తీసుకుంటామని చెప్పటంతో ఆందోళన విరమించారు. బీజేవైఎం జిల్లా నాయకులు బోయ రాము, నంబికృష్ణ, నరేందర్‌జీ, మహేష్, బాలచందర్‌శెట్టి, రుతుకుమార్, మహేందర్ యాదవ్, నరేష్, దినేష్ పాల్గొన్నారు.

భర్తను గొడ్డలితో

నరికి చంపిన భార్య

- చెన్నంపల్లిలో ఘటన



రాములు (ఫైల్)

లింగాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని చెన్నంపల్లిలో దారుణం జరిగింది. మేకల రాములు (41)అనే వ్యక్తిని భార్య మేకల ఎల్లమ్మ గొడ్డలితో నరికి చంపిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాగుడుకు బానిసలైన భార్యాభర్తలు తరచూ గొడవపడేవారు. ఇదే తరహాలో ఆది వారం రాత్రి కూడా మద్యం మత్తులో ఉన్నవారు తమఇంట్లో గొడవ పడ్డారు. నిద్రలోకి జారుకున్న భర్తను చూసిన భార్య రోకలిబండతో తలపై బాదింది. ఆ తర్వాత అక్కడే ఉన్న గొడ్డలితో నరికి చంపింది. అలికిడిని విని అనుమానంతో ఇంటిపక్కన ఉండే కొంతమంది అక్కడికి వెళ్లి పరిశీలించగా ఈ సంఘటన వెలుగు చూసింది. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సోమవారం మృతుని తల్లి మాసమ్మ ఫిర్యాదు మేరకు అచ్చంపేట సీఐ రవీందర్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. మృతదేహానికి అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

హామీలు విస్మరించిన సీఎం

కొత్తకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అక్ష్యక్షురాలు జయలక్ష్మీ ఆరోపించారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన బస్సు జాతా సోమవారం కొత్తకోటకు చేరుకున్నది. కొత్తకోట చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పనిని బట్టి పారితోషకం ఇచ్చే పద్ధతి వద్దని రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నీలాదేవి, సునీత, బాలమణి, పద్మ, సీఐటీయూ నాయకులు ఉన్నారు.

మా ఊరును విలీనం చేయొద్దు

రాస్తారోకో చేసిన బలిజపల్లి గ్రామస్థులు

పెద్దమందడి, డిసెంబరు 23, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని బలిజపల్లిని జంగమయ్యపల్లి పంచాయతీలో విలీనం చేయొద్దని సోమవారం బలిజపల్లి గ్రామస్థులు రాస్తారోకో చేశారు. పెద్దమందడి ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి, ఘనపూర్ ఎస్‌ఐ పోలీసులతో సంఘట స్థలానికి చేరుకున్నారు. గత ప్రభుత్వం జంట గ్రామాలైన జంగమయ్యపల్లి గ్రామం నుంచి బలిజపల్లి గ్రామాన్ని నూతన పంచాయతీగా ఏర్పాటు చేశారు. దీంతో ఇరు గ్రామాల్లో అభివృద్ధి చేసుకున్నామన్నారు. మళ్లీ గ్రామ పంచాయతీలను ఒకటిగా చేసి రెండు గ్రామాల మధ్య ఘర్షణ చోటుచేసుకునేలా చేశారని ఆరోపించారు. అనంతరం గ్రామస్థులు ఆర్డీవో సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందజేశారు. మాజీ సర్పంచు జయంతి, గిరిజాదేవి, గ్రామ నాయకులు శశివర్ధన్‌రెడ్డి, సత్యశిలారెడ్డి, సంజీవరెడ్డి ఉన్నారు.



యేసు క్రీస్తు జన్మించిన పశువుల పాక అలంకరణ



క్రిస్టియన్‌పల్లిలోని చర్చిలో క్రిస్మస్‌ట్రీ



క్రిస్టియన్‌పల్లిలోని బెత్లహమ్ చర్చి వద్ద విద్యుద్దీపాలతో అలంకరించిన చెట్లు

చర్చీల ముస్తాబు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని పలు చర్చీలలో వారం రోజులుగా సెమీ క్రిస్మస్ వేడుకలు, క్రిస్మస్ విందులు ఏర్పాటు చేసి క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకల కోసం క్రిస్టియన్ పల్లిలోని క్రిస్తుజ్యోతి చర్చిలో సోమవారం రాత్రి శాంట్ క్లాక్‌లు, క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లో ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించడంతో సమీప కాలనీల ప్రజలు చర్చి వద్దకు తమచిన్నారులతో వచ్చి సందర్శిస్తున్నారు. చిన్నారులు క్రిస్మస్ తాతా వేషధారణలో ఉన్న వ్యక్తులతో సరదాగా గడుపుతున్నారు.



▲ విద్యుద్దీప కాంతులతో వెలిగిపోతున్న పాలమూరు ఎంబీసీ చర్చి



క్రిస్టియన్‌పల్లి చర్చిలో స్టార్స్ అలంకరణ



◄ క్రిస్టియన్‌పల్లి లోని బెత్లహమ్ చర్చిని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన దృశ్యం

మా ఊరు - మా పాలన

-నల్లమల గిరిజనులలో పీసా, ఏజెన్సీ చట్టాలపై పెరిగిన అవగాహన - నేడు పీసా దినోత్సవం

పదర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లమల లోతట్టు ప్రాంతంలో గిరిజనులు జీవిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో గిరిజనేతరులతో పాటు కొన్ని గిరిజన తెగలు ఉండగా అడవిలోపల మాత్రం పెంటల్లో, గూడేలలో ఆదివాసి చెంచు గిరిజనులు జీవిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని 1950లో భారత రాజ్యంగంలోని 5వ షెడ్యూల్‌లోని 243 ఎం, 244 నుంచి షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించింది. ఈ ప్రాతంలో ఏజెన్సీ హక్కులతో పాటు, పీసా (పంచాయతీ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియా)చట్టం అమలు చేయాల్సి ఉంటుందని ఆదివాసీ చెంచులు అంటున్నారు.

షెడ్యూల్డ్ తెగల కోసం భారత రాజ్యంగంలోని ఆర్టికల్ 342 ద్వారా 1950 జనవరి 26న ఏజెన్సీ యాక్ట్ అమల్లోకి వచ్చింది. అదే విధంగా భారత రాజ్యంగం షెడ్యూల్డ్ ప్రాంతాల గ్రామ సభ(పీసా)1996 డిసెంబరు 26న అమల్లోకి వచ్చింది. ఇది గ్రామ పంచాయతీల 73వ సవరణలో భాగంగానే వచ్చింది. ఈ చట్టం ప్రకారం మా ఊరు - మా పాలన అనేది చెంచు పెంటల్లో, గూడేలలో ఆ గ్రామాలలో పీసా తీర్మానం చేసినట్లే జరగాలి. ఆ తీర్మానమే అసెంబ్లీ, పార్లమెంట్ తీర్మానాలతో సమానమని చెంచు వేదిక సంఘాలు నల్లమలలో ప్రచారం చేస్తున్నాయి. ఈ చట్టం ప్రకారం స్వయం పాలనలో భాగంగా డివిజన్ స్థాయిలో ఆర్‌డీవో, జిల్లా స్థాయిలో కలెక్టర్, రాష్ట్ర స్థాయిలో గవర్నర్, దేశ స్థాయిలో రాష్ట్రపతి బాధ్యులుగా ఉంటారని అంటున్నారు. 1996 డిసెంబరు 24న నల్లమల ప్రాంతంలో పీసా చట్టం అమల్లోకి వచ్చింది. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో 129 చెంచు గ్రామాలు ఉండగా అందులో గత ప్రభుత్వ హయాంలో సమగ్ర సర్వే పేరుతో అధికారులు 80 చెంచు పెంటలు మాత్రమే గుర్తించినట్లు చెంచులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికి దాదాపు 75 సంవత్సరాలు వచ్చిన మా అడవి బిడ్డలకు వర్తించే చట్టాలను అనదొక్కుతూ అటవీ హక్కు చట్టాలకూ ఊతం ఇస్తున్నారని చెంచులు వాపోతున్నారు. మైదాన ప్రాంతాలకు తరలించే కుట్ర పన్నారని అందులో భాగంగానే ఫారెస్టు వారు 2024జూన్ 19న 591గ్రామాల నుంచి 64వేల801 షెడ్యూల్డ్ తెగలకు చెందిన కుటుంబాలను వన్య ప్రాణి సంరక్షణ బోర్డు యాక్ట్ 1972ను అడ్డం పెట్టుకుని ఆదివాసీ లేకుండా చేసే కుట్ర జరుగుతోందని చెంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవి హక్కుల చట్టం 2006ను కూడా తుంగలో తొక్కి అటవీ శాఖ చట్టాలను అమలు పరచడంతో ఆదివాసీ చెంచులు అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెంచు వేదిక ఆధ్వర్యంలో అన్ని చెంచుపెంటల్లో, గూడేలలో పీసా తీర్మాన కమిటీలు వేశామని తెలిపారు. రాష్ట్రంలో ఇక్కడి నుంచే మొదటి సభ ఏర్పాటు చేస్తూ పీసా (షెడ్యూల్డ్ తెగల గ్రామాల సభ) ప్రకారం మా ఊరు-మా పాలన చేపట్టాలని అభిప్రాయపడుతున్నారు.

నేడే పీసా దినోత్సవ సభ...

అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ గ్రామంలో గిరిజన భవన్‌లో మంగళవారం పీసా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ చెంచు వేదిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఆదివాసీల సాంస్కృతిక ఆటలు, పాటలతో పాటు చెంచులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆయా శాఖల అధికారులకు వినతులుంటాయని తెలిపారు. అదే విధంగా ఈ కార్యమాక్రమానికి కలెక్టర్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఎస్పీ, సివిల్ కోర్టు జడ్జి, ఐటీడీఏ, ఆర్‌డీవో, డీటీడీవో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు ఆహ్వానం పలికినట్లు వారు పేర్కొన్నారు.



బోయలగూడెంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కనుల పండువగా రథోత్సవం

గట్టు(గద్వాల) డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని బోయలగూడెంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి (గట్టు తిమ్మప్ప) రథోత్సవం ఆదివారం రాత్రి కనుల పండువగా సాగింది. రథాన్ని వీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు రథోత్సవానికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమం తిలకించడానికి చుటు పక్కల గ్రామాల ప్రజలతో పాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

స్టాఫ్ నర్సులకు ప్రేరణ తరగతులు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి

కందనూలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పల్లె దవాఖానాల్లో నూతనంగా నియమించబడిన ఎంఎల్‌హెచ్‌పీలకు, పీహెచ్‌సీల్లోని స్టాఫ్ నర్సులకు సోమవారం డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయంలో సోమవారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ జాతీయ కార్యక్రమాలైన అసంక్రమిత వ్యాధుల నియంత్రణ, క్షయ, వ్యాధిగ్రస్థులను గుర్తించడం, పర్యవేక్షించడం, గర్భిణుల ఆరోగ్యం, చిన్నారుల ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలను పల్లె దవాఖానాల పరిధిలో విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. నియమించబడిన ఎంఎల్‌హెచ్‌పీలు సమయపాలన పాటించాలని సూచించారు. అసంక్రమిత వ్యాధుల గురించి డబ్ల్యూహెచ్‌వో కన్సల్‌టెంట్, డాక్టర్ అబ్దుల్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ క్రిష్ణ, మోహన్, డీపీవో రేణయ్య, ఏపీవో విజయ్‌కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్వకుర్తిలో ఈ-కోర్టు ప్రత్యేక చాంబర్ ప్రారంభం

కల్వకుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈ-కోర్టు ప్రత్యేక చాంబర్‌ను జిల్లా న్యాయాధికారి రాజేష్‌బాబు మంగళవారం ప్రారంభిస్తారని జూనియర్ సివిల్ న్యాయాధికారి జే కావ్య సోమవారం తెలిపారు. ఈ చాంబర్ ప్రారంభంతో కక్షిదారులకు తమ కేసు పూర్వపరాలను, తేదీలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. న్యాయవాదులు క్రిమినల్, సివిల్ కేసులు ఫైలింగ్ ఈ-కోర్టు ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమానికి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

స్పోర్ట్స్ బాక్స్

క్రీడలతో మానసికోల్లాసం

▸▸ జోగుళాంబ గద్వాల జిల్లా క్రీడాధికారి ఆనంద్



క్రీడాకారులతో జిల్లా క్రీడాధికారి ఆనంద్, కోచ్‌లు, పీఈటీలు

అయిజటౌన్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జోగుళాంబ గద్వాల జిల్లా క్రీడాధికారి ఆనంద్ అన్నారు. అయిజ పట్టణంలో కొనసాగుతున్న సీఎం కప్ బాలుర ఓపెన్ కేటగిరి రాష్ట్ర స్థాయి ఖోఖో క్యాంపును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, చదువుపై కూడా శ్రద్ధ పెరుగుతుందన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు తెలంగాణ ప్రభుత్వం సీఎం కప్ పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తోందని చెప్పారు. ఈ నెల 19న ప్రారంభమైన ఖోఖో క్యాంపునకు 24 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. వారిలో ప్రతిభ కనబరిచిన 15 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వరంగల్‌లో ఈ నెల 26న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు. క్యాంపులో పాల్గొంటున్న క్రీడాకారులకు ఉచితంగా భోజనం, హాస్టల్ వసతి కల్పించిన బ్రైట్‌స్టార్ పాఠశాల కరస్పాండెంట్ జేపీ ఎస్తేర్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో క్రీడాశాఖ పీడీలు బషీర్, నర్సింహరాజు, పీఈటీలు సుబ్బన్న, రఘు పాల్గొన్నారు.

భువనేశ్వర్‌కు బయలుదేరిన క్రీడాకారులు



క్రీడాకారులతో వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, కోచ్, పీడీలు

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ అథ్లెటిక్స్ మహిళలు, పురుషుల జట్లు సోమవారం ఒడిషా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌కు బయలు దేరి వెళ్లాయి. అక్కడి కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (కెఐఎస్ఎస్) డీమ్డ్ యూనివర్సిటీలో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఆలిండియా సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీలో పాల్గొననున్నాయి. ఈ సందర్భంగా వీసీ జిఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ యూనివర్సిటీ క్రీడాకారులు పోటీల్లో చక్కటి ప్రతిభ కనపరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం వారికి ట్రాక్‌సూట్, టీమ్ యూనిఫాంలను అందించారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, ఓఎస్డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, పీడీ డాక్టర్ శ్రీనివాసులు, కోచ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి పదర విద్యార్థిని



మధుప్రియ

పదర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రానికి చెందిన బినమోని వెంకటమ్మ, భిక్షపతి దంపతుల కుమార్తె మధుప్రియ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన 10వ తెలంగాణ రాష్ట్ర క్రాస్‌కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండు కిలోమీటర్ల పరుగు పందెంలో పాల్గొని రజత పతకం సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. మధుప్రియ ప్రస్తుతం కొల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నది. నల్గొండ జిల్లా డిండి క్రీడా అకాడమీలో శిక్షణ పొందుతోంది.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ క్రీడా పోటీలకు సంగంబండ గురుకులం విద్యార్థినులు




రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ చంద్రకళ, షూటింగ్‌బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం

మక్తల్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని సంగంబండ గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21న పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో వారు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ చంద్రకళ, షూటింగ్‌బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం వారిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఎంపికైన బాలికలు ఈ నెల 24 నుంచి 26 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా జట్టు కోచ్‌గా ఎంపికైన పీఈటీ శ్రీలతకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మక్తల్ మండల ప్రజాపరిషత్ పాఠశాల విద్యార్థి భరత్‌కుమార్ సబ్‌జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల, ప్రధానోపాధ్యాయుడు పరంధాములు, కోచ్ దీప విద్యార్థిని అభినందించారు.

ఏడడుగుల బుల్లెట్టు


మహారాష్ట్ర క్రీడాకారుడు ఆకాష్

▸▸ జాతీయ వాలీబాల్ పోటీల్లో ప్రత్యేక ఆకర్షణ



క్రీడాకారుడు ఆకాష్‌తో పీడీ రమణ, కరాటే మాస్టర్ అనిల్

నారాయణపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కోస్గిలో కొనసాగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో మహారాష్ట్ర క్రీడాకారుడు ఆకాష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. 7.2 అడుగుల పొడవున్న అతడితో సెల్ఫీ దిగేందుకు క్రీడాకారులు పోటీ పడుతున్నారు. వీడు ఏడడుగుల బుల్లెట్టు అంటూ సరదాగా కామెంట్ చేస్తున్నారు.







డబ్బులెవరికీ ఊరికే రావు..

నాణ్యమైన వస్తు, సేవలను పొందడం మన హక్కు

▸▸ సరైన అవగాహన లేక నష్టపోతున్న ప్రజలు ▸▸ ధైర్యంగా ముందుకు రావాలి

▸▸ నష్టపోయినా, మోసపోయినా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలి

▸▸ నేడు జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం

మహబూబ్‌నగర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : డబ్బులెవరికీ ఊరికే రావు.. చేసిన ఖర్చుకు తగిన వస్తు, సేవలు పొందడం మన హక్కు. నష్టపోయిన, మోసపోయిన వారికి వినియోగదారుల ఫోరం అండగా నిలబడుతోంది. ఈ విషయంపై సరైన అవగాహన లేక చాలా మంది నష్టపోతున్నారు. ఎంతో ముచ్చట పడి మార్కెట్‌లో వస్తువులు కొనుగోలు చేసిన వారు, అవి సరిగా లేకపోయినా, సరైన సేవలు అందనప్పుడు సంబంధిత దుకాణానికి వెళ్లి అడిగినా, వారు సరైన సమాధానం ఇవ్వకుండా అమ్మడం వరకే తమ బాధ్యత అన్నట్లుగా వ్యవహరిస్తుంటారు. కొనుగోలు చేసినపుడే అన్నీ చూసుకోవాలంటూ దురుసుగా వ్యవహరిస్తూ ఉంటారు. అలాంటి సమయాల్లో వినియోగదారుల ఫోరం వారికి అండగా నిలుస్తోంది.

న్యాయం చేయడమే లక్ష్యం



వినియోగదారులకు న్యాయం చేయడమే ఫోరం లక్ష్యం. బాధితులు నేరుగా వచ్చి ఫిర్యాదు చేసే కేసును స్వీకరిస్తాం. కొనుగోలు చేసిన వస్తువు బిల్లులు, ఆధారాలు సమర్పించాలి. మహబూబ్‌నగర్‌కు చెందిన వ్యక్తి ఢిల్లీలో వస్తువు కొనుగోలు చేసి నష్టపోయినా, ఇక్కడ ఫిర్యాదు చేయొచ్చు. మునిసిపాలిటీల్లో నిర్దేశిత పన్ను కన్నా అధికంగా వసూలు చేసినా ఫోరంను ఆశ్రయించవచ్చు. వస్తువు విలువ రూ.50 లక్షల లోపు ఉంటే మహబూబ్‌నగర్‌లో ఫిర్యాదు చేయాలి. అంతకన్నా ఎక్కువగా ఉంటే హైదరాబాద్ ఫోరంను ఆశ్రయించాల్సి ఉంటుంది.

– ఎం అనూరాధ, వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు

పోతే పోనీలే అనుకొని నష్టపోవద్దు

వినియోగదారుల ఫోరం అందించే సేవలపై ప్రతీ అవగాహన కలిగి ఉండాలి. కొత్త చెప్పులు నాలుగు రోజులకే తెగిపోయినా, ముచ్చటపడి కొన్న చీర డ్యామేజీ అయినా, కొన్న విత్తనాలు మొలకెత్తకపోయినా.. ఫోరం తలుపు తట్టవచ్చునన్న విషయాన్ని తెలుసుకోవాలి. అయితే చాలా మంది చిన్న చిన్న వస్తువులు కొని నష్టపోయినప్పుడు ఫోరం వరకు ఎందుకు? పోతే పోయిందిలే అనుకొని వదిలేస్తుంటారు. మరికొంత మంది ఫోరంను ఎలా ఆశ్రయించాలో తెలియక సర్దుకుపోతుంటారు. కానీ మోసపోయినా, నష్టపోయినా తప్పనిసరిగా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయాలి. అప్పుడే వ్యాపారులు కూడా సరైన సేవలు, నాణ్యమైన వస్తువులు అందించేందుకు కృషి చేస్తారు.

ఫిర్యాదులకు ఫీజు తక్కువే..

వివిధ వస్తు సేవల కొనుగోలులో మోసపోయిన, నష్టపోయిన వారు వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసేందుకు చాలా తక్కువ ఫీజు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. వస్తువు లేదా సేవల విలువ ఐదు లక్షల రూపాయల లోపు అయితే ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఐదు లక్షల రూపాయల నుంచి రూ. 10 లక్షల లోపు అయితే రూ. 250, రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు రూ.400, రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు వెయ్యి రూపాయలు, రూ. 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు రెండు వేలు మాత్రమే ఫీజు ఉంటుంది.

ఏటా 90 నుంచి 100 కేసులు

ఉమ్మడి పాలమూరు జిల్లా మొత్తానికి మహబూబ్‌నగర్ పట్టణంలో ఒకే ఒక వినియోగదారుల ఫోరం ఉంది. ఇక్కడ ఫోరం అధ్యక్షుడు, ఇద్దరు సభ్యులతో కూడిన బెంచ్ అన్ని పని దినాల్లో కేసులను విచారిస్తుంది. ఫోరంకు ఈ ఏడాది 98 కేసులు వచ్చాయి. గత ఏడాది 80 కేసులు నమోదయ్యాయి. ఫోరం ప్రారంభం అయిన తరువాత ఇప్పటివరకు 6,211 కేసులను విచారించింది. వినియోగదారులు ఆన్‌లైన్లో వివరాలు సమర్పించి, ఫోరంను సంప్రదించవచ్చు. లేదా న్యాయవాది ద్వారా ఫిర్యాదు చేసినా, కేసును స్వీకరిస్తారు.

బిల్లులు భద్రపరుచుకోవడం తప్పనిసరి

వినియోగదారులు తాము కొనుగోలు చేసిన ప్రతీ వస్తువు బిల్లును తప్పనిసరిగా భద్ర పరుచుకోవాలి. కొనుగోలు చేసిన తేదీ నుంచి రెండేళ్లలోపు ఫోరంను ఆశ్రయించేందుకు అవకాశం ఉంటుంది. ఒకవేళ ఏడాది లోపు వారంటీ ఉండి, వస్తువు పని చేయకపోతే ఆ సమయంలోనే కేసు వేయాలి. మార్కెట్‌లో కొనుగోలు చేసిన ఏ వస్తువు సరిగా లేకపోయినా, లోపమున్నా, నిర్ధారిత ధర కన్నా ఎక్కువ తీసుకున్నా, కొత్త వాహనాల పేరుతో పాతవి విక్రయించినా ఫిర్యాదు చేయొచ్చు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో సెల్ ఫోన్లు, వాహనాల సర్వీసులు, వైద్య సేవల్లో నిర్లక్ష్యం, ఆన్‌లైన్లో జరిగిన మోసాలపై ఎక్కువ కేసులు వస్తున్నాయి. వ్యవసాయానికి సంబంధించి విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలకెత్తినా పూత, గింజ పట్టకపోవడం వంటి ఫిర్యాదులు వస్తున్నాయి. గద్వాల, బిజినేపల్లి, భూత్పూర్ మండలాల పరిధిలో ఈ బెడద ఎక్కువగా ఉంటోంది. రైతులు విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు తప్పని సరిగా బిల్లు తీసుకొని భద్ర పరుచుకోవాలి. నష్టం జరిగినప్పుడు ముందుగా మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయాలి. ఆ తర్వాత అన్ని ఆధారాలు, అవసరమైన ధ్రువపత్రాలతో ఫోరంలో ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా న్యాయం జరుగుతుంది.



● మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రముఖ మాల్‌లో ఓ మహిళ ఎంతో ముచ్చటపడి పట్టుచీర కొనుగోలు చేసింది. తీరా కట్టుకుం దామని చూసే సరికి అది డ్యామేజ్ అయి ఉంది. వెంటనే చీర తీసుకుని మాల్‌కు వెళ్లి అడిగింది. వారి నుంచి సరైన స్పందన రాలేదు. దీంతో ఆమె నేరుగా వినియోగదారుల ఫోరాన్ని ఆశ్ర యించడంతో సంబంధిత మాల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసింది. దీంతో వారు ఆ మహి ళకు మరో కొత్త చీరను ఇచ్చి కేసును పరిష్కరించుకున్నారు.

● పాలమూరుకు చెందిన ఓ వ్యక్తి ప్రముఖ కంపెనీ వస్త్రాన్ని తీసుకుని, వారి వద్దనే సూట్ కుట్టించుకున్నారు. కానీ అది సరిగా కుదరలేదు. టైలర్ చేసిన పొరపాటుతో నష్టపోయిన అతడు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. వారు సదరు వస్త్ర పరిశ్రమ నుంచి రూ. 10 వేలు పరిహారం ఇప్పించారు.

● గద్వాల జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి రూ.70 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ చేశారు.. రెండేళ్లు సక్రమంగా ప్రీమియం చెల్లించారు. ఆ తరువాత ఆయన చనిపోయారు. పాలసీ డబ్బు కోసం కుటుంబీకులు ఇన్సూరెన్స్ కంపెనీని సంప్రదిస్తే వారు నిరాకరించారు. పాలసీ చేయకముందే ఆ ఉద్యోగికి అనారోగ్య సమస్యలున్నాయని, డబ్బులు రావని చెప్పడంతో బాధిత కుటుంబీకులు ఫోరంను ఆశ్రయించారు. ఈ కేసు ప్రస్తుతం విచారణలో ఉంది.



మహబూబ్‌నగర్ పట్టణంలోని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కార్యాలయం

హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

▸▸ ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ డిమాండ్ ▸▸ నేడు గద్వాల పట్టణంలో భారీ ర్యాలీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్, చిత్రంలో సరిత

గద్వాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని, లేదంటే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆయనను బర్తరఫ్ చేయాలని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ డిమాండ్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్ పర్సన్ సరితతో కలిసి మాట్లాడారు. రాజ్యాంగంపై, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం దేశంలోని 29 రాష్ట్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా గద్వాల పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తామని చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో పాటు పార్టీ మండలాల అధ్యక్షులు, బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అలంపూర్ మార్కెట్ చైర్మన్ దొడ్డప్ప, టీపీసీసీ సభ్యుడు గంజిపేట శంకర్, పట్టణ అధ్యక్షుడు ఇసాక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, ఇస్మాయిల్, మాల మహానాడు నాయకుడు శ్రీనివాసులు, కబీర్దాస్ నర్సింహులు పాల్గొన్నారు.

రైతులను డబ్బులడిగితే కఠిన చర్యలు

▸▸ మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి పుష్పమ్మ



మిల్లు సిబ్బంది, అధికారులతో మాట్లాడుతున్న పుష్పమ్మ

అలంపూరు చౌరస్తా, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పత్తి విక్రయించేందుకు వచ్చిన రైతులను డబ్బులు అడిగితే కఠిన చర్యలు తప్పవని మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి పుష్పమ్మ హెచ్చరించారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని వరసిద్ధి వినాయక కాటన్ మిల్లులో కొనసాగుతున్న పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. వెనక వచ్చిన బండ్లను లోపలికి పంపించేందుకు, తేమ శాతం తక్కువగా రాయించేందుకు డబ్బులు తీసుకుంటున్నారని వచ్చిన ఫిర్యాదుపై ఆరా తీశారు. సిబ్బంది, అధికారులు డబ్బులు అడిగితే తనకు ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. కొనుగోలు చేసిన పత్తిని ఎప్పటికప్పుడు జిన్నింగ్ చేయించాలని, కొనుగోళ్లను నిలపొద్దని మిల్లు యజమానికి సూచించారు.

పిల్ల కాలువలో భారీ కొరమీను



నెట్టెంపాడు పిల్ల కాలువలో దొరికిన భారీ కొరమీను చేప

అయిజ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని భూమ్‌పూర్ గ్రామ సమీపంలోని నెట్టెంపాడు పిల్ల కాలువలో భారీ కొరమీను చేప లభించింది. గ్రామానికి చెందిన రైతు బోయ హనుమంతు సోమవారం ఉదయం పైరుకు నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. ఆ సమయంలో పిల్ల కాలువలో పెద్ద పాము లాగా కనిపించడంతో భయపడ్డాడు. సమీపంలోకి వెళ్లి పరిశీలించాడు. కొరమీను చేప అని గుర్తించి పట్టుకున్నాడు. అది పది కిలోలకు పైగా బరువుందని తెలిపాడు.

క్రైం కార్నర్

మరోసారి చిరుత పంజా

▸▸ ఇంటికి వస్తున్న మేకల మందపై దాడి

▸▸ కాపరి చూస్తుండగానే ఘటన

మద్దూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలో చిరుత పులి మరో సారి పంజా విసిరింది. ఆదివారం చిరుత దాడిలో రెండు మేకలు చనిపోయాయి. తాజాగా సోమవారం మరో సారి చిరుత మేకల మందపై దాడి చేసింది. మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన పట్నాల చంద్రప్ప సోమవారం సాయంత్ర తన మేకల మందతో ఇంటికి వస్తుండగా చిరుతపులి దాడి చేసింది. ఒక మేకను అడవిలోకి లాక్కెళ్లింది. తన కంటి ముందే ఈ సంఘటన జరగడంతో కాపరి తీవ్ర భయాందోళనలకు గురయ్యాడు. అయినా ధైర్యం కూడగట్టుకొని కొంతదూరం దాని వెంట పరుగెత్తినా ఫలితం లేకపోయింది. అలాగే ఆదివారం రాత్రి కూడా గ్రామ సమీపంలోని ఆంజనేయులుకు సంబంధించిన పొలంలోని పశువుల కొట్ట వద్ద చిరుత కనిపించిందని గ్రామస్థులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కల్వకుర్తి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి న్యాయాధికారి జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చారు. కల్వకుర్తి ఎస్‌ఐ జి.మాధవరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన మహేందర్, హైదరాబాద్‌లోని సైదాబాద్‌కు చెందిన నరసింహులు మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరు పరిచారు. మహేందర్‌కు రెండు రోజుల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా, నరసింహకు, మూడు రోజుల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి కావ్య తీర్పు వెల్లడించారు. అలాగే తుర్కపల్లికి చెందిన మల్లేశ్ ఈనెల 19న మద్యం తాగి శ్రీశైలం క్రాస్‌రోడ్డు వద్ద నిర్వహిస్తున్న డ్రంకెన్ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని సోమవారం కోర్టులో హాజరు పరచగా మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

మూడు తులాల బంగారం చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కుమ్మెర గ్రామంలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి నగలు, నగదు ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నిరంజన్ కుటుంబసభ్యులతో కలిసి ఈ నెల 21న ఇంటికి తాళం వేసి అదే గ్రామంలో ఉండే బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు తాళం విరగ్గొట్టి, ఇంట్లోకి చొరబడ్డారు. మూడు తులాల బంగారు ఆభరణలతో రూ.న 14,500ను ఎత్తుకెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చిన నిరంజన్‌కు తాళం విరిగి ఉండటం కనిపించింది. దీంతో లోనికి వెళ్లి పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. సంఘటనపై పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి ఇంటిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అలంపూరుచౌరస్తా, డిసెంబరు 23, (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని ఇటిక్యాలపాడు శివారులో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. హైవే సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు నుంచి గద్వాల వైపు కూరగాయల లోడుతో వెళ్తున్న ఆటోను, మినీ గుడ్సు వాహనం వెనక నుండి ఢీకొన్నది. దీంతో ఆటోలో ఉన్న లక్ష్మి, వెంకటమ్మ, శాలులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని, బాధితులను కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం

నవాబ్‌పేట, డిసెంబరు 23 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని తీగలపల్లి గ్రామానికి చెం దిన ఓ వ్యక్తి గత వారం రోజుల క్రితం అదృశ్యం అయినట్లు ఎస్‌ఐ విక్రం తెలి పారు. లక్ష్మీనారాయణ ఈ నెల 16న ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టుపక్కల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించ లేదు. చివరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పోలీసులకు సమాచారం ఇవ్వాలి

- నరేష్ కుమార్, ఎస్ఐ



గోపాల్‌పేట , డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రజలు తమ ఇంటి నుంచి ఇతర గ్రామాలకు బయటి ప్రదేశాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చెప్పి వెళ్లాలని ఎస్ఐ నరేష్ కుమార్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

మండలంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయి.?

ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామల్లో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయి.

డ్రంకెన్ డ్రైవ్ పై కేసులు చేశారా?

ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో ఉండే వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాం. నిత్యం మా సిబ్బంది ప్రధాన రహదారిపై డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు చేస్తున్నాం. డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికితే కేసులు నమోదు చేస్తాం.

గస్తీలు నిర్వహిస్తున్నారా?

రాత్రి సమయంలో పెట్రోలింగ్ సిబ్బంది గ్రామాల్లో తిరుగుతున్నారు. ఎవరైనా అనుమానితులుగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తీసుకుంటాం.

చోరీకి గురైన ఫోన్లను గుర్తించి తిరిగి ఇస్తున్నారా?

మొబైల్ వినియోగదారుడు తమ సెల్ ఫోన్ పోగొట్టుకుంటే మీ సేవలో ఆన్‌లైన్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. దొరికిన తర్వాత మీ సెల్‌ఫోన్ మీకు అందిస్తాం.

న్యూస్ బాక్స్

అందుబాటులో వరి విత్తనాలు

మదనాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి గాయత్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీపీఎం నాయకుల నిరసన

అమరచింత, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ పంజాబ్, హర్యానా రైతులు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షలకు మద్దతుగా సోమవారం సీపీఎం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

పెబ్బేర్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అనుసందానమైన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని వనపర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడు అన్నారు. సోమవారం మండలంలోని గుమ్మడం, తిప్పాయిపల్లి గ్రామాల్లో బీజేపీ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో భాజపా అభ్యర్థులు అన్ని స్థానాల్లో పోటీ చేయడం జరుగుతుందన్నారు. నారాయణ, ప్రకాష్‌శెట్టి, శేఖర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

కొత్తకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ కౌన్సిలర్ భరత్ భూషణ్ సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఏసు బోధనలతోనే ప్రపంచ శాంతి



కొత్తకోటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏసు బోధనలతో ప్రపంచ శాంతి నెలకొంటుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంబీ చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ హక్కులను కాపాడుతుందన్నారు. కేక్ కట్ చేసి క్రి స్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని చర్చీల పాస్టర్లు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. మార్కెట్, సీడీసీ చైర్మనులు ప్రశాంత్, గొల్లబాబు, చంద్రశేఖర్‌రెడ్డి, బోయోజ్, కృష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్, శ్రీనువాసులు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకటేష్, గోకరయ్య, సాయులు యాదవ్, జేసీబీరాము, రాములు యాదవ్, బాలరాజు యాదవ్ పాల్గొన్నారు.

మాస్టర్ మైండ్ పాఠశాలలో..

పెబ్బేరు : మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మాస్టర్ మైండ్ స్కూల్ లో క్రిస్మస్ పండుగ ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులచే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆటపాటలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లావణ్య రంగారెడ్డి ఏసు ప్రభు జననం గిరించి వివరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు, విద్యార్థులకు ఆమె క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీ కార్మికులకు తప్పని తిప్పలు

మూడు నెలలుగా అందని వేతనాలు

చిన్నంబావి డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులకు వెతలు తప్పడంలేదు. పొట్టకూటికి కోసం మురుగు కాలువలు, రోడ్లు శుభ్రపరిచే గ్రామపంచాయతీ కార్మికులకు మూడు, నాలుగు నెలలుగా వేతనాలు అందడంలేదని వాపోతున్నారు. రెగ్యులర్‌గా వేతనాలు అందకపోవడంతో కుటుంబాలు గడవక అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా, దీపావళి పండుగలకు వేతనాలు రాకపోగా.. సంక్రాంతికైనా వస్తాయనే ఆశతో ఎదురుచూస్తున్నారు. చిన్న గ్రామపంచాయతీలకు ప్రస్తుతం నిధులు కూడా సక్రమంగా రావడం లేదని పన్నులు కూడా వసూలు కాక అంతంతమాత్రంగానే ఉండటంతో పంచాయతీల నిర్వహణ భారంగా మారింది. మండలంలోని 14 గ్రామపంచాయతీలో 71 మంది



వేతనాలు చెల్లించాలని దీక్షలు చేస్తున్న కార్మికులు(ఫైల్)



మురుగు కాల్వ శుభ్రం చేస్తున్న కార్మికురాలు

కార్మికులు పనిచేస్తున్నారు. నిత్యం గ్రామాల్లో పరిశుభ్రంగా ఉంచడం, తాగునీటి సరఫరా పంచాయతీ మోటార్లలో నిర్వహణ వంటి పనులు చేసే వారికి జూలై వరకే వేతనాలు అందించారు. నిధులు లేకపోవడంతో వేతనాలు చెల్లింపు జాప్యం జరుగుతుందని అధికారులు చెబుతు న్నారు.

కుటుంబ పోషణ భారంగా మారింది



ప్రతీనెల వేతనాలు రెగ్యులర్‌గా అందక కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారింది. దీంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తినడానికి నిత్యావసర సరుకులకు అప్పులు చేశాం. ఇప్పటికైనా వేతనాలు అందించి కుటుంబ పోషణ భారం తగ్గించాలి.

- కురువమ్మ, పారిశుధ్య కార్మికురాలు, వెల్టూర్

ఎస్‌టీవోకు పంపించాం...



పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. కొన్ని జీపీల్లో నాలుగు, మరికొన్ని చోట్ల మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటికి సంబంధించిన బిల్లులు చేసి ఎస్‌టీవోకు పంపించాను. నిధులు మంజూరైన వెంటనే కార్మికులకు ఖాతాల్లో జమ చేస్తాం.

- రమణారావు, ఎంపీడీవో

భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలి

వనపర్తి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం వారి భవిష్యత్తు కోసం ఎంతో వెచ్చిస్తోందని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పీర్లగుట్టలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. వసతి గృహ విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్స్, బ్లాంకెట్లను, స్వెటర్లు, రింగ్ బాల్స్, చెస్ మెటీరియల్స్, సహా పలు ఆట వస్తువులను పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాల్ని, ఈ సదుపాయాలను చక్కగా వినియోగించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్ : భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తారని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. సోమవారం పానుగల్ మండల పరిధిలోని గోప్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

అటవీ భూముల్లో బీటీ రోడ్లు..

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : మండల పరిధిలోని అంజనగిరి తండా, చెరువు ముందరి తండాలకు అటవీ భూముల వెంట బీటీ రోడ్లు నిర్మించేందుకు జిల్లాస్థాయి ఫారెస్టు కమిటీ ఆమోదించినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాస్థాయి ఫారెస్టు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పీఆర్ రోడ్డు నుంచి అంజనగిరి తండా వరకు బీటీ రోడ్డు వేసేందుకు 0.69 హెక్టార్ల భూమి, చెరువు ముందరి తండాకు వయా పెద్ద తండా రహదారికి 0.91 హెక్టార్ల అటవీ భూమి కేటాయించేందుకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు.

రైతే ధర నిర్ణయించే రోజులు రావాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతే పంట ధరను కూడా నిర్ణయించే రోజులు రావాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు దినోత్సవం సందర్భంగా ఆయన పలువురు రైతులను శాలువాలతో సన్మానించి మాట్లాడారు. పంటలను సాగు చేయాలంటే పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని పంట దిగుబడిమాత్రం తగ్గిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, బాల్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రాములు యాదవ్, నరేందర్, రామచంద్రయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులను సన్మానిస్తున్న వేముల శ్రీనివాస్ రెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగంగా పూర్తి చేయాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై మండలాల ప్రత్యేక అధికారులు దృష్టి సారించి సర్వే వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ప్రత్యేక అధికారులతో వీసీ ద్వారా మాట్లాడారు. సర్వే నెమ్మదిగా జరుగుతున్న చోట ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. సర్వే వేగంగా పూర్తయ్యేలా సర్వేయర్లకు దిశా నిర్దేశం చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా సర్వే పూర్తి కావాలని ఆదేశించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావు

వనపర్తి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ప్రధాని బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావు అని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సంస్కరణలతో సంక్షోభ కాలాన్ని జయించి దేశాన్ని ముందుకు నడిపించిన పాలన సమర్థులు పీవీ నరసింహారావు అని కొనియాడారు. దేశ ప్రధానిగా ఆయన అమలు చేసిన సంస్కరణలు దేశ గతిని మార్చాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్ , సమన్వయకర్త లక్కాకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నేడు కాంగ్రెస్ పార్టీ నిరసన

వనపర్తి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కమిటీ ఆర్డినేటర్ జిల్లెల ఆదిత్య, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. మొదట జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మర్రికుంటలోని ఆంజనేయ దేవాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అనుబంధ సంఘాలకు సంబంధించిన ప్రతీఒక్కరు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆటో బోల్తా : దంపతులకు గాయాలు

కొత్తకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనిమెట్ట గ్రామ శివారు జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడి దంపతులకు గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. మదనాపురం మండల దుప్పల్లికి చెందిన భార్యాభర్తలు నాగలక్ష్మీ, కుమార్ మహబూబ్‌నగర్‌కు సొంత ఆటోలో వెళ్తుండగా... అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొని బోల్తా పడింది. గాయపడిన ఇద్దరిని అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

చీరల పంపిణీ

అమరచింత, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం అమరచింతలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని 20 ఏళ్లుగా వృద్ధులు, వికలాంగ మహిళలు, ఒంటరి మహిళలకు 70 మందికి క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చీరలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ చర్చ్ పాస్టర్ హ్యాపీ పాల్, దాత కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ ఉన్నారు.

వామపక్ష రైతు సంఘాల నిరసన

అమరచింత/ ఆత్మకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ సరిహద్దుల్లో జరుగుతున్న రైతుల ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా సోమవారం ఆత్మకూరులో వామపక్ష పార్టీల సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకురావాలనుకోవడం సరికాదని సూచించారు. పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో రైతుల ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. రైతులు పండించిన ప్రతి గింజకు కేంద్రం గిట్టుబాటు ధర ఇవ్వడంతో పాటు అరెస్టు అయిన రైతులను విడుదల చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. రైతుల పక్షాన తమ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాబర్ట్, రాజు, శ్రీహరి, ప్రసాద్, మోష, బుచ్చన్న, లక్ష్మి నారాయణ శెట్టి, లింగన్న, ఖాజాపీర్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

రామానుజన్ అడుగు జాడల్లో విద్యార్థులు నడవాలి

వనపర్తి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్క విద్యార్థి రామానుజన్ అడుగు జాడల్లో నేటితరం విద్యార్థులు నడవాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య అన్నారు. సోమవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య అధ్యాపక బృందంతో కలిసి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. గణిత శాస్త్రానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అకాడమీ కోఆర్డినేటర్ దామోదర్ రెడ్డి, విష్ణుమూర్తి, మ్యాథమెటిక్స్ అధ్యాపకులు లక్ష్మి, విద్యార్థిను పాల్గొన్నారు.

గణిత ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఖిల్లాఘణపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని గణిత ల్యాబ్, గణిత నమూనాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో జయశంకర్ తెలిపారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవంను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో జయశంకర్ మాట్లాడారు. ప్రతి సంవత్సరం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు గణిత సంబరాలు చేసుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు గణిత రంగవల్లులు వేసి గణిత నమూనాల ద్వారా టీఎల్ఎం ప్రదర్శనలు చేసి విద్యార్థులకు గణిత విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆసక్తిగా గణిత మేళా ప్రదర్శనను తిలకించారు. గణిత మేళలో ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మునవార్ సుల్తానా, లక్ష్మీకాంత్, వెంకటరమణ, శోభారాణి, శారధ పాల్గొన్నారు.



వనపర్తి డిగ్రీ కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు



ఖిల్లాఘణపురంలో ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

సీఎం కప్ పోటీలకు కల్వరాల విద్యార్థులు



వీపనగండ్లలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వీపనగండ్ల , డిసెంబరు 23, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కల్వరాల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అథ్లెటిక్స్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజవర్ధన్‌చారి తెలిపారు. ఈ నెల 16 నుంచి 21 వరకు వనపర్తి జిల్లాలో జరిగిన అథ్లెటిక్స్ విభాగంలో సబ్ జూనియర్ ట్రాయథ్లాన్ ఈవెంట్‌లో కల్వరాల విద్యార్థులు ఎండీ రెహాన్, మీనాక్షి ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడో స్థానం సాధించారు. త్వరలో హనుమకొండలో నిర్వహించే రాష్ట్ర సీఎం కప్ పోటీలకు ఈ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతో పాటు ఫిజికల్ డైరెక్టర్ నందిమల్ల శ్రీకాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు

ఖిల్లాఘణపురం : రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ అండర్ 14 పోటీలకు మండలంలోని దొంతికుంట తండా మోడల్ స్కూల్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సి ద్దు ఎంపికైనట్లు సోమవారం పాఠశాల ప్రిని స్పాల్ ఉమాదేవి తెలిపారు. వనపర్తి జిల్లా కేం ద్రంలో ఈనెల 20న నిర్వహించిన సీఎం కప్ టోర్నీలో కిక్ బాక్సింగ్ పోటీల్లో విద్యార్థి సిద్ధు ప్ర తిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పో టీలకు ఎంపికైన విద్యార్థి సిద్ధును పాఠశాల ఆవ రణలో ప్రిన్సిపాల్ ఉమాదేవితో పాటు పాఠశాల లోని ఉపాధ్యాయులు అభినందించారు.



కిక్ బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సిద్ధు..

క్రీడోత్సవంలో విద్యార్థుల ప్రతిభ



క్రీడోత్సవంలో విజేతలుగా నిలిచిన కొత్తకోట ప్యూపిల్స్ స్కూల్ విద్యార్థులు

కొత్తకోట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో ఆదివారం నిర్వహించిన క్రీడోత్సవంలో కొత్తకోట ప్యూపిల్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనిబరిచినట్లు స్కూల్ డైరెక్టర్ చంద్రహాసన్‌రెడ్డి తెలిపారు. ఖోఖో పోటీలో బాలికలు, బాలురు ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే వాలీబాల్ పోటీలో బాలురు ప్రథమ బాలికలు ద్వితీయ స్థానంలో నిలిచారు. క్రీడోత్సవంలో ప్రతిభ కనబరిచిన కేపీఎస్ విద్యార్థులను పారా ఒలంపిక్స్ విజేత దీప్తి జీవాంజ్, ద్రోణాచార్య అవార్డుగ్రహీత రమేష్ బహుమతి అందజేసి అభినందించినట్లు తెలిపారు. సోమవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అభినందించారు. స్కూల్ చైర్మన్ రాజవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ కృష్ణవేణితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

మదనాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాముఖ్యత ఇస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌నారాయణ అతని సోదరులు కలిసి సొంతంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యతమైన ఆహారం అందించేందుకు 40 శాతం డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు ఇటీవల పెంచడం జరిగిందని అన్నారు. ప్రశాంత్, పద్మావతి, గజ్జల నాగన్న, మద్దిలేటి, జగదీష్, రామకృష్ణ, మహేష్‌కుమార్,శేఖర్‌రెడ్డి, కోటేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు

వనపర్తి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంయుక్త కిసాన్ మోర్చా, సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, కుల వివక్ష పోరాట సమితి నాయకుల ఆధ్వర్యంలో నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, రైతులపై కేసులు ఎత్తివేయాలని, నిరసన కార్యక్రమం చేసి అనంతరం నూతన వ్యవసాయ మార్కెట్ జీవో కాపీలను దహనం చేశారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

లింకు కాలువ పనులు ప్రారంభం

పెద్దమందడి, డిసెంబరు 23, (ఆంధ్రజ్యోతి) : కానాయపల్లి శంకర సముద్రం నుంచి మోజర్ల, వెల్టూరు గ్రామాలకు సాగునీరు అందించేందుకు 19వ ప్యాకేజీ కింద కాలువ నిర్మించారు. కానీ కాలువ సాగునీరు రావడం లేదు. దీంతో వెల్టూరు వేణుగోపాల సముద్రం చెరువు నుంచి లింక్ ఆప్ ద్వారా మోజర్ల రైతులకు సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక కృషితో సోమవారం కాలువ పనులు ప్రారంభించినట్లు వనపర్తి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి తెలిపారు. రఘుప్రసాద్, శంకర్‌రెడ్డి, హరిచంద్రరెడ్డి, శ్రీను, మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వడ్ల విజయ్,గామ రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

అమరచింత, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప భక్తులకు అన్నదానం (బిక్ష) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల అనంతరం అరుణ్ కుమార్ చేపట్టిన బిక్షలో స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ రాష్ట్ర కల్లు విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ పాల్గొని స్వాములకు భిక్ష వడ్డించారు. అ న్నదాత అరుణ్ కుమార్‌ను అయ్యప్ప భక్తులు అభినందించారు. ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. గురుస్వాములు నరసింహులు గౌడ్, కమలాకర్‌గౌడ్, రవికాంత్, భాస్కర్, పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

అమరచింత/ఆత్మకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరు మండలం చింతపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఆ సంఘం నాయకులతో కలిసి పరిశీలించారు. పాఠశాలలో 200 మంది విద్యార్థులు ఉంటే రెండే బాత్రూంలు, ఒక టాయిలెట్ మాత్రమే ఉన్నాయని అన్నారు. బోర్ వాటర్ నీటిని విద్యార్థులు తాగడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే ఫిల్టర్ వాటర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసినా.. క్షేత్రస్థాయిలో మౌలిక వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

'మహిళా సంఘాలపై కౌన్సిలర్ పెత్తనం సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

పెబ్బేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాలపై రెండో వార్డు కౌన్సిలర్ అక్కమ్మ మితిమీరిన ఆగడాలు చేస్తూ.. మహిళా సంఘాల సభ్యులను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తుందని పరమేశ్వరి టౌన్ లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు జ్యోతి, ప్రధాన కార్యదర్శి బొజ్జలమ్మలు అన్నారు. సోమవారం పెబ్బేరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పెబ్బేరు పట్టణంలో టౌన్ మహిళా సంఘం భవనం పదేళ్ల కిందట నిర్మించారని దానిని కౌన్సిలర్ అక్కమ్మ అధికారుల అనుమతి, పాలకవర్గం అనుమతి లేకుండా రాత్రిపూట ఎక్స్‌కవేటర్‌తో తొలగించిందని ఆరోపించారు. మహిళా సంఘం వెనుక ఒక వెంచరుకు రహదారి లేకపోవడంతో వారు అక్కమ్మతో కుమ్మక్కు కావడంతో భవనాన్నే కూలగొట్టిందన్నారు. పోలీసులకు, మున్సిపాలిటీలో ఫిర్యాదు చేసినా.. ఎవరూ పట్టించుకోలేదన్నారు.

ఇటీవల పెబ్బేరులో రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోతున్న వారికి స్థలాల సేకరణలో భాగంగా మునిసిపాలిటీకి చెందిన కొంత పార్కును మునిసిపల్, పాలకవర్గం తొలగించిందని మునిసిపల్ చైర్మన్ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని అక్కమ్మ సాటి మహిళపై ఆరోపణ చేసిందని మరి మహిళా సంఘాన్ని కూలగొడితే అధికారులు నాయకులు ఎందుకు పట్టించుకోలేరని ప్రశ్నించారు.